జ్వరాల బారిన జనం

- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వైనం
- ఒక్కొక్కరికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు



సోమారంపేటలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు (ఫైల్)

మాచారెడ్డి: జిల్లాలో కొద్ది రోజులుగా జ్వరాలు పీడిస్తున్నాయి. కుటుంబంలో ఒకరి తర్వాత ఒకరు జ్వరాల బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. వారం నుంచి పది రోజుల వరకు జ్వరాలు తగ్గడం లేదని బాధితులు వాపోయారు. జ్వరంతో పాటు జలుబు, దగ్గు, తల, ఒళ్లు నొప్పులతో జ్వరపీడితులు బాధపడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. ఒక్కొక్కరికి రూ.5 వేల నుంచి పది వేల వరకు ఖర్చవుతుందని బాధితులు 'సాక్షి'కి తెలిపారు. నాలుగు నుంచి ఐదు రోజుల పాటు జ్వరం తగ్గకపోతే పరీక్షలు చేయించాల్సి వస్తోందని పలువురు వివరించారు. గతేడాది లక్ష్మీరావులపల్లిలో 25 మందికి డెంగీ సోకి అస్వస్థతకు గురికాగా వైద్య సిబ్బంది శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల భవానిపేట, ఎల్లంపేట, సోమారంపేట గ్రామాల్లో సైతం డెంగీ కేసులు నమోదయ్యాయి. డెంగీ, మలేరియా సోకిన ప్రతిసారి వైద్యాధికారులు ఆయా గ్రామాలను సందర్శించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించడం ఆనవాయితీ. మళ్లీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారడంతో సీజనల్ వ్యాధులు సోకుతున్నాయి.

పడిపోతున్న ప్లేట్‌లెట్స్..

చాలా మంది జ్వర పీడితుల్లో ప్లేట్‌లెట్స్ పడిపోయి నీరసానికి గురవుతున్నారు. ప్లేట్‌లెట్స్‌తో పాటు తెల్ల, ఎర్ర రక్తకణాలు హెచ్చు తగ్గులు కావడం వల్ల జ్వర పీడితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అలాగే సీఆర్‌పీ(సీ రియాక్టివ్ ప్రోటీన్) పెరగడం వల్ల జ్వరాలు తగ్గడం లేదని వైద్యులు చెబుతున్నారు. దీంతో అధిక మోతాదులో యాంటీ బయాటిక్ ఇంజెక్షన్లు ఇవ్వాల్సి వస్తోందని పలువురు వైద్యులు వివరించారు. ఇంకా చాలా మందిలో తల తిప్పడం, వాంతులు వంటి లక్షణాలు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

చిన్న పిల్లల్లో అధికం..

చిన్న పిల్లల్లో వైరల్ జ్వరలక్షణాలు అధికంగా కనపడుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు ప్రైవేటు పిల్లల ఆస్పత్రులకు తరలిస్తున్నారు. మూడు నుంచి ఐదు రోజుల పాటు ఆస్పత్రిలో చేర్చుకొని దోపిడీ చేస్తున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.కోట్లు వెచ్చిస్తున్నా మెరుగైన వైద్యం అందకపోవడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నట్లు పలువురు బాధితులు తెలిపారు.

వాతావరణ మార్పులతోనే..



వాతావరణంలో జరిగే మార్పుల వల్ల వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరపీడితులు కంగారు పడకుండా వేడి వేడి ఆహారపదార్థాలు తీసుకోవాలి. కాచి వడబోసిన నీటిని తాగాలి.

– డాక్టర్ శరత్ కుమార్, ఎండీ, అసోసియేట్ ప్రొఫెసర్, కామారెడ్డి మెడికల్ కాలేజీ

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వండి



మాట్లాడుతున్న మాతా శిశు సంరక్షణ అధికారి యామిని

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మాతా శిశు సంరక్షణ అధికారి యామిని సూచించారు. సోమవారం లింగంపేట పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో నమోదైన గర్భిణుల, ప్రసవాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 12 వారాలలోపు గర్భిణుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. నమోదు చేసుకున్న గర్భిణులకు మొదటి రెండు సోమవారాలు పీహెచ్‌సీలో మూడు, నాలుగు సోమవారాలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా అధికారి వేణుగోపాల్, పీహెచ్‌సీ వైద్యులు హిమబిందు, రాంబాయి, సీహెచ్‌వో రమేశ్, ఫరీదాబేగం, యాదగిరి, శుభాష్, ప్రదీప్, రాజమణి, రాజేశ్వరీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గొల్ల కుర్మలకు నగదు బదిలీ చేయాలి



మాట్లాడుతున్న రవీందర్

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గొల్ల కుర్మలకు రూ. 2 లక్షల నగదు బదిలీతో రెండో విడత గొర్ల పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గొల్ల కుర్మలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. రెండేళ్ల నుంచి జీవాలకు కనీసం నట్టల మందు కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ వందలాది గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెలకు ప్రభుత్వం ఉచిత ఇన్సూరెన్స్ పథకం అమలు చేయాలని కోరారు. గొర్రెల పంపిణీ కోసం కట్టిన డీడీలను వాపస్ ఇవ్వకుండా, గొర్రెలు పంపిణీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సంఘం జిల్లా కన్వీనర్‌గా సురేష్, కో–కన్వీనర్లుగా గంగాధర్, కనక రాజులను ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

పాఠశాలకు నీటి శుద్ధి యంత్రం అందజేత



పిట్లం(జుక్కల్): పిట్లం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 1993–96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నీటి శుద్ధి యంత్రాన్ని ఎంఈవో దేవిసింగ్ చేతులమీదుగా పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ రెడ్డి, నారాయణ బోయిని, ప్రమోద్ కుమార్, రమణారావు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల విరాళం



కామారెడ్డి అర్బన్: అవార్డీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి ఎస్సీవాడ ప్రాథమిక పాఠశాలకు కుర్చీలను విరాళంగా అందజేశారు. ఎంఈవో ఎల్లయ్య, ఉపాధ్యాయులు అంబీర్ సరితబాయి, జ్యోత్స్న, రాణి తదితరులు పాల్గొన్నారు. కుర్చీలో కూర్చుని చిన్నారులు మురిసిపోయారు.

ఏఐసీసీ నేతతో భేటీ



నిజాంసాగర్(జుక్కల్): జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక కోసం జిల్లా కేంద్రానికి వచ్చిన ఏఐసీసీ పరిశీలకుడు రాజ్‌పాల్ ఖరోలాను సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్ మర్యాదపూర్వకంగా కలిశారు. మూడు దశాబ్దాల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తున్నానని, పార్టీలో పదవి లేకున్నా కష్టపడుతున్నానని.. తనకు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆయనను కోరినట్లు ఏలె మల్లికార్జున్ సాక్షికి తెలిపారు. అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్లి, జిల్లా అధ్యక్ష పదవి ప్రక్రియను చేపడుతామని పరిశీలకుడు చెప్పినట్లు మల్లికార్జున్ చెప్పారు. నాయకులు రవీందర్‌రెడ్డి, పండరి, దత్తు, సాయిలు తదితరులున్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి




సదాశివనగర్(ఎల్లారెడ్డి): చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రామకోటి జప లిఖిత ప్రచారకుడు కృష్ణానంద స్వామి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో సరస్వతీ మంత్రోపదేశం చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో రామకోటి రాయించారు. పాఠశాల సిబ్బంది రాజ్యలక్ష్మి, అనిత, జ్యోతి, నిఖిత, శిరీష, అఖిల తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పోషణ కోసం ఉద్యోగం కల్పించండి



ఎల్లారెడ్డి: కుటుంబ పోషణ కోసం తనకు ఉద్యోగం కల్పించాలని కోరుతూ విద్యుత్ శాఖ డీఈ పార్థసారథికి నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్‌కు చెందిన యాదగిరి సోమవారం వినతిపత్రం అందించారు. లైన్‌మెన్, ఆపరేటర్లు విద్యుత్ పనిమీద స్తంభం ఎక్కించడంతో తనకు కాళ్లు చచ్చుబడి పోయాయని, దీంతో నడవలేక పోతున్నానని బాధితుడు యాదగిరి డీఈకి విన్నవించారు. దీంతో తన కుటుంబ పోషణ భారంగా మారిందని తనకు విద్యుత్ శాఖలో ఉద్యోగం కల్పించాలని బాధితుడు యాదగిరి విన్నవించారు. విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సోమవారం రెండు ఫిర్యాదులు వచ్చినట్లు డీఈ తెలిపారు.

రైతుబిడ్డకు మెడిసిన్ సీటు



మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రానికి చెందిన రైతు వెంకటరాంరెడ్డి కూతురు సింగిరెడ్డి వర్షిణిరెడ్డి మెడిసిన్‌లో సీటు సాధించింది. నీట్ పరీక్షలో 880 ర్యాంక్ సాధించి వరంగల్ కాకతీయ కళాశాలలో ప్రవేశం పొందింది. గ్రామస్తులు వర్షిణి రెడ్డిని అభినందించారు.


'భోజనం సరిగ్గా పెట్టడం లేదు'



బిచ్కుందలో రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో సోమవారం మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాలలో భోజనం సరిగ్గా పెట్టడడం లేదని, గుడ్లు ఇవ్వడం లేదని, భోజనంపై ప్రిన్సిపల్ సునీతను అడిగితే ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారని అన్నారు. విద్యార్థులను వేధించడమే పనిగా ప్రిన్సిపల్ పెట్టుకున్నారని ఆరోపించారు. పాఠశాలలో భోజనంపై, ప్రిన్సిపల్‌పై అధికారులకు రెండు నెలల క్రితం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రిన్సిపల్ సునీత మాకొద్దని నినాదాలు చేశారు. విద్యార్థులు ధర్నా చేస్తున్న విషయం మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే తెలుసుకుని వచ్చారు. విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమింపజేశారు.

కోడ్ తొలగినా.. మేల్కోని అధికారులు



రాజంపేట: స్థానికల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో గత నెల 29న ఎన్నికల కోడ్ అమలులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో తహసీల్ కార్యాలయంలో నూతన రేషన్ కార్డు, అడిషన్, డిలీషన్‌లకు సంబంధించి ఎలాంటి దరఖాస్తులు స్వీకరించబోమని కార్యాలయంలో నోటీసులు ఏర్పాటు చేశారు. గత గురువారం హైకోర్టు స్థానిక ఎన్నికలపై స్టే విధించడంతో ఎన్నికల కమిషన్ కోడ్‌ను ఎత్తేసింది. కోడ్ తొలగి నాలుగు రోజులు కావస్తున్నా కార్యాలయంలో నోటీసులు తొలగించకపోవడంపై కార్యాలయానికి వచ్చిన అర్జీదారులు అవాక్కవుతున్నారు.

పుస్తక నిర్వహణపై అవగాహన ఉండాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మహిళా పొదుపు సంఘాలకు సంబంధించిన పుస్తకాలలో విషయాలను ఎలా రాయాలో బుక్‌కీపర్లు, వీవోఏలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐకేపీ సీసీ మెహెర్ కుమార్ అన్నారు. ఎర్రాపహాడ్‌లో సోమవారం పుస్తక నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రతి నెలా నిర్వహించే సమావేశాలు, ఆర్థిక లావాదేవీలు, తీర్మానాల పుస్తకాలు, సభ్యుల వివరాలకు సంబంధించిన పుస్తకాలలో తప్పులు లేకుండా రాయాలన్నారు. సీసీ నర్సిములు, ఎర్రాపహాడ్, కస్‌కల్, కరడ్‌పల్లి గ్రామాలకు చెందిన బుక్‌కీపర్లు, వీవోఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

'వైద్యులు అందుబాటులో ఉండటం లేదు'





పశువుల ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న రైతులు, వైద్యుడు లేక ఖాళీగా ఉన్న కుర్చీ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రం వీక్లీ మార్కెట్‌లోని ప్రభుత్వ పశు వైద్యశాల ముందు పాడి రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. చికిత్స కోసం పశువులను తీసుకొచ్చిన రైతులకు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రి ముందు బైఠాయించి గంటపాటు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పశు వైద్యశాలలో డాక్టర్లు అందుబాటులో ఉండడం లేరని, సమయానికి వైద్యం అందక పాడి పశువులు, మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పశువులకు సరైన వైద్యం అందక, పాడి రైతులు నష్ట పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ పశు వైద్యులను సంప్రదించాల్సి వస్తోందన్నారు. ఉచితంగా పంపిణీ చేయాల్సిన మందులను ఆస్పత్రి సిబ్బంది పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. నట్టల నివారణ మందులు కూడా ప్రభుత్వ ఆస్పత్రి అందుబాటులో లేవన్నారు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడంలేదని, తక్షణమే కలెక్టర్ స్పందించాలని డిమాండ్ చేశారు. పశు వైద్యశాలలో వైద్యులు, మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాడి రైతులు రాజేష్, సురేష్, రమేష్, కృష్ణ, మహేందర్, శ్రీధర్ తదితరులున్నారు.

కలెక్టరేట్ ముందు నిరసన



కామారెడ్డి టౌన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. దాడి చేసిన వ్యక్తిని తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంథని సామ్యేల్ డిమాండ్ చేశారు. నాయకులు పద్మారావు, యాదగిరి, లక్ష్మి, సాయిలు, బాలరాజు గౌడ్, సాయి వరుణ్, రమేష్, బాలమణి, శివానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్కుల వితరణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజానకంపల్లి మాజీ సర్పంచ్ దేశబోయిన సాయిలు తన కూతురు అమూల్య జన్మదినం సందర్భంగా సోమవారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్కులను వితరణ చేశారు. పాఠశాల హెచ్ఎం అనసూయ, పంచాయతీ కార్యదర్శి శంకర్, ఫీల్డ్‌అసిస్టెంట్ రాములు, ఉపాధ్యాయులు రాకేష్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భజన మండలికి తబలా, కార్డ్‌లెస్ సెట్..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన కీ.శే. శ్యాంరావు పటేల్ కుమారుడు రిటైర్డ్ జడ్జి రఘునాథరావు సనాతన భజన మండలికి తబలా, కార్డ్‌లెస్ సెట్‌లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు జడ్జికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విండో చైర్మన్ కమలాకర్ రావు, మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ గాదారి గంగారెడ్డి, భజన మండలి ప్రతినిధులు కొప్పుల నర్సారెడ్డి, జంగం గంగాధర్, అశోక్ రెడ్డి, రాజిరెడ్డి, పోసాని దుర్గయ్య, కుమ్మరి శేఖర్, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరి



కామారెడ్డి క్రైం: ప్రతి వాహనానికి నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని పట్టణ ట్రాఫిక్ ఎస్సై మహేష్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నెంబర్ ప్లేట్ సక్రమంగా లేని వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. నిబంధనల ప్రకారం లేని నెంబర్ ప్లేట్‌ల స్థానంలో కొత్త నెంబర్ ప్లేట్‌లను బిగింపజేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పిట్లం(జుక్కల్): పోషణ మాసాన్ని పురస్కరించుకుని చిల్లర్గి గ్రామం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'మీరు తినే ఆహారం మీ పెరుగుదల' అనే అంశంపై పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదే విధంగా చిన్నకొడప్గల్ గ్రామంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పోషణ మాసాన్ని పురస్కరించుకొని చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు.

సాగులో నూతన పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ నరసింహారెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు వ్యవసాయ సాగులో నూతన పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ నరసింహారెడ్డి అన్నారు. తాడ్వాయి రైతువేదికలో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్, మహాత్మాజ్యోతిబా పూలే, కరీంనగర్, మాలుతుమ్మెద వ్యవసాయ కళాశాలల ఆధ్వర్యంలో రైతు సదస్సును నిర్వహించారు. ఈ కళాశాలలకు చెందిన విద్యార్థులు తాడ్వాయి మండలంలోని అన్నిగ్రామాలలో తిరుగుతూ పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మమేకమై నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలన్నారు. ఈ సందర్భంగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శాస్త్రవేత్తలు అనీల్‌రెడ్డి, రేవంత్, మండల వ్యవసాయ అధికారి నర్సింలు, విస్తరణాధికారులు శ్రావణ్ కుమార్, అశోక్‌రెడ్డి, శివ చైతన్య, రమ్య, హారిక, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం నరకం



భిక్కనూరు-రామేశ్వర్‌పల్లి మధ్య కంకర తేలిన రోడ్డు

భిక్కనూరు: మండల కేంద్రం నుంచి రామేశ్వర్‌పల్లి వరకు ఉన్న రోడ్డుపై కంకర తేలడంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వారు నరకం అనుభవిస్తున్నారు. వాహనాలపై ప్రయాణించడం కంటే నడిచి వెళ్లడం ఉత్తమంగా భావిస్తున్నారు. భిక్కనూరు నుంచి రాజంపేట వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు వరద నీరు ఈ రోడ్డు పై ప్రవహించడంతో రోడ్డు కొట్టుకుపోయి కంకర మాత్రమే మిగిలింది. వర్షాలు కురుస్తుండటంతో కాంట్రాక్టర్ తిరిగి పనులు ప్రారంభించలేదు. కంకర తేలడంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని ఈ రోడ్డును బాగుచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణికి పలువురు అధికారుల గైర్హాజరు



రాజంపేటలో ప్రజావాణిలో ఖాళీగా దర్శనమిస్తున్న అధికారులకు వేసిన కుర్చీలు

రాజంపేట: ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం చేపడుతుండటే సంబంధిత అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి తహసీల్దార్, ఎంపీడీవో, ఏపీఎం, పీహెచ్‌సీ, ఐకేపీ అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారుల మాత్రం ప్రజావాణికి హాజరు కాలేరు. దీంతో ఖాళీ సీట్లు దర్శనమిచ్చాయి. అధికారులు నిర్లక్ష్యం పట్ల మండల ప్రజలు మండిపడుతున్నారు.

సంక్షిప్తం

విధుల్లో చేరిన వైద్యులు



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట పీహెచ్‌సీలో వైద్యులు హిమబిందు సోమవారం విధుల్లో చేరారు. హిమబిందు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దాంతో కామారెడ్డి పట్టణంలోని పల్లె దవాఖానాకు చెందిన వైద్యులు రాంబాయికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆమె నుంచి హిమబిందు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పీహెచ్‌సీలో అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

రేపటి నుంచి గ్రామాలలో పశు వైద్యశిబిరాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల 15 నుంచి నవంబరు 14 వరకు పశు వైద్యశిబిరాలను నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. ఈ శిబిరాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయనున్నట్లు వివరించారు.

ఎల్లారెడ్డిలో ఫిజియోథెరపి క్యాంపు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కార్యాలయంలో సోమవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ అరుణ్ చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రతి రోజు ఫిజియోథెరపికి సంబంధించిన వ్యాయామాలు చేయడం వల్ల అంగవైకల్యం దూరమవుతుందన్నారు. సిబ్బంది వెంకటేశం తదితరులున్నారు.

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల కోసం సోమవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. ఐఈఆర్‌పీ కమల్ కిషోర్, వైద్యురాలు సారిక పాల్గొన్నారు. తల్లిదండ్రులకు చిన్నారులకు ఇంటి వద్ద చేసే వ్యాయామం గురించి వివరించారు.

ఆరేపల్లి పాఠశాలలో వైద్య శిబిరం



రాజంపేట: ఆరేపల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఆర్‌బీఎస్‌కూ(తాడ్వాయి) ఎంఎస్‌టీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పలువురికి మందులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం బి.నగేష్, వైద్యులు హరీష్ గౌడ్, గౌతమి, ఫార్మసిస్ట్ స్వప్న, ఏఎన్ఎం నీరజ, శ్యామ్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.